
శుక్రవారం.. జొన్నాడ వద్ద..

మహిళా..! ఉచిత బస్.. వచ్చేస్తోంది..!



మహిళలకు శుభవార్త.. సీఎం చంద్రబాబునాయుడు ఒక్కొక్కటిగా హామీలు నెరవేరుస్తున్నారు.. మరో హామీ నెరవేర్చనున్నారు.. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం హామీ అమలుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవ కానుకగా మహిళలకు ఉచిత బస్ ప్రయాణం సౌకర్యం కల్పిస్తామని సీఎం వెల్లడించారు. ఆ దిశగా తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో బస్‌లు సిద్ధం చేస్తున్నారు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మహిళలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు 15.. స్వాతంత్ర్య దినోత్సవం నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ఈ పథకం ఢిల్లీ, తెలంగాణ, కర్నాటకల్లో అమలవుతోంది. ఎన్నికలకు ముందు సీఎం చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల్లో 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం' ప్రధానమైన వాగ్దానం. పథకం ప్రారంభించిన తర్వాత ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకూడదనే ఉద్దేశంతో ఆ రాష్ట్రాల్లో ఇప్పటికే అధ్యయనం చేయించి ఒక అంచనాకు వచ్చారు. విధివిధానాలను ఖరారు చేసే పనిలో ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ పథకం అమలు దాదాపు చివరి అంకంలో ఉంది. ఈ మేరకు అవసరమైన బస్సులను యుద్ధప్రాతిపదికన సిద్ధం చేస్తున్నారు.

బస్‌లకు మరమ్మతులు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమండ్రి, నిడదవోలు, కొవ్వూరు, కాకినాడ, తుని, ఏలేశ్వరం, అమలాపురం, రాజోలు, రామచంద్రాపురం, రావులపాలెం డిపోల్లోని పల్లె వెలుగు బస్సులను పూర్తిగా పరీక్షించి ఆ మేరకు మరమ్మతులు చేస్తున్నారు. పథకం ప్రారంభించిన తర్వాత బస్సుల సీటింగ్ కెపాసిటీకి మించి రద్దీగా ప్రయాణికులు ఉండే అవకాశం ఉంది. ఈమేరకు కొన్ని డిపోలకు కొత్తగా సూపర్ లగ్జరీ బస్సులు ఇచ్చారు. బాగా పాతబడిన వాటి బాడీలను పల్లెవెలుగు బస్సులతో మార్పుచేస్తున్నారు. గణాంకాలు పరిశీలిస్తే మొత్తం ఒక రోజులో ప్రయాణించే వాళ్లలో పల్లె వెలుగు బస్సుల్లో 50 శాతం రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మార్పు పనులను ఆయా జిల్లాల జిల్లా ప్రజా రవాణా అధికారులు (డీపీటీవోలు) ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తున్నారు. ఈడీ విజయరత్నం ప్రతిరోజూ సమీక్షలు నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాకు ఉచితమట!

ఉచిత ప్రయాణం ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన కల్పిస్తారనే చర్చ నడుస్తోంది. అంటే తూర్పుగోదావరి జిల్లా మహిళలు కోనసీమ, కాకినాడ జిల్లాల వరకూ ప్రయాణించవచ్చు. వారికి జీరో టికెట్ ఇస్తారు. దీనిలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఉదాహరణకు కొవ్వూరు ఉమ్మడి పశ్చిమ గోదావరి పరిధిలోకి వస్తుంది. కానీ కొత్త జిల్లాల విభజనలో తూర్పులో కలిసింది. ఇప్పుడు ఉమ్మడి జిల్లాల పరిధి అమలు చేస్తే ఏలూరు నుంచి కొవ్వూరు వరకూ ఉచితంగా వచ్చేసి, అక్కడి నుంచి రాజమండ్రికి టికెట్ కొనుక్కోవాల్సి రావచ్చు. ఇంకో ఐదు కిలోమీటర్లే కదా అని టికెట్ తీసుకోని వారి సంఖ్యా ఉంటుంది. వీళ్లను గుర్తించడం కష్టంగా మారొచ్చు. ఆర్టీసీ ఆవిధంగానూ ఆదాయం కోల్పోయే అవకాశం లేకపోలేదు. ఇక ఉచిత ప్రయాణం మొదలు పెట్టిన తొలి రోజుల్లో తెలంగాణ, కర్నాటక చాలా కష్టాలు ఎదుర్కొన్నాయి. ఆయా ఇబ్బందులను అధిగమించే దిశగా ఆలోచన చేస్తున్నారు. దీంతో త్వరలోనే ఉచిత బస్ ప్రయాణం అమల్లోకి రానుంది.

- యుద్ధప్రాతిపదికన బస్సులు సిద్ధం
- ఆగస్టు 15 నుంచి అమలు
- ఆర్టీసీ డిపోల్లో చురుగ్గా పనులు
- ఉమ్మడి జిల్లా పరిధిలో ఉచితం?
- రోజుకు రూ.30 లక్షల భారం
- 'పల్లె వెలుగు'లకు మెరుగులు
- మహిళల ఆనందం

ఉమ్మడి జిల్లాలో 532 బస్సులు

తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 285 బస్సులు ఉండగా 165 పల్లెవెలుగు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 291కి 191, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 300కి 176 పల్లెవెలుగులు ఉన్నాయి. అంటే ఉమ్మడి తూర్పుగోదావరిలో మొత్తం అన్ని రకాల బస్సులు కలిపి 876 ఉండగా, వాటిలో 532 పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు ఉన్నాయి. వీటన్నిటినీ యుద్ధప్రాతిపదికన సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం తూర్పుగోదావరిలో 89 వేలు, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో 80 వేల చొప్పున కలుపుకొని రోజుకు సరాసరిన 2.50 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఆర్టీసీలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగులో దాదాపు 50 శాతం మంది ప్రయాణిస్తున్నారు. మూడు జిల్లాల్లోని 11 ఆర్టీసీ డిపోల్లో రోజుకు రూ.1.20 కోట్ల ఆదాయం సమకూరుతోంది. వీటిలో పల్లె వెలుగు వాటా దాదాపు రూ.60లక్షల పైనే ఉంటుంది. మొత్తం ప్రయాణికుల్లో 50 శాతం మహిళల లెక్కన చూసినా రోజుకు రూ.30 లక్షల వరకూ ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది.



బస్‌లు తీర్చిదిద్దుతున్నాం..



ప్రభుత్వ ఉద్దేశానికి అనుగుణంగా పథకం ప్రారంభించిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు రాకుండా బస్సులు తీర్చి దిద్దుతున్నాం. పల్లె వెలుగు బస్సుల్లో ఎక్కువగా రద్దీ ఉండే అవకాశం ఉంది. కాబట్టి వాటిపై మరింత దృష్టి సారించాం. దిశానిర్దేశాలపై ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. ఏ బస్సులను తిప్పడానికైనా సిద్ధంగా ఉన్నాం.

- శ్రీనివాసరావు, డీపీటీవో, కాకినాడ జిల్లా

ఈనెల 10న మెగా పేరెంట్, టీచర్ మీట్

కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈనెల 10న మెగా పేరెంట్, టీచర్ మీట్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పరస్పర సమన్వయంతో విద్య, ప్రవర్తన, సామాజికపరంగా విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి, ఉత్తమ మానవ వనరులను దేశానికి అందించే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో 1,260 ప్రభుత్వ, 596 ప్రైవేటు, 20 ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 2,78,932మంది విద్యార్థులతో కార్యక్రమం జరుగుతుందన్నారు. 141 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో 45,344 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో ఈ మీట్ నిర్వహిస్తున్నామన్నారు. విజయవంతం చేయడానికి ప్రణాళికలను రూపొందించాలని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు, పేరెంట్, టీచర్ అసోసియేషన్లకు సూచించారు. కార్యక్రమాల నిర్వహణకు అంశాల వారీగా ఆహ్వానం, బడ్జెట్, కొనుగోళ్లు, పాఠశాలల పరిశుభ్రత, సుందరీకరణ, పర్యావరణ భద్రత, రిసెప్షన్, సిట్టింగ్ ఏర్పాట్లు, ప్రగతి నివేదిక తయారీ, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు, ఆహారం, తాగునీరు, పార్కింగ్, వైద్య సాయం, గ్రీన్ పాస్‌పోర్టు, డాక్యుమెంటేషన్, ఫొటో, వీడియో కవరేజీ, తల్లికి వందనం, మీడియా కవరేజీల కోసం ప్రత్యేక కమిటీలకు బాధ్యతలను అప్పగించాలన్నారు. విద్యార్థుల హెల్త్ కార్డులను తల్లిదండ్రులకు చూపించి వారి పోషణ, ఆరోగ్యంపై చర్చించాలన్నారు. మాదకద్రవ్యాల వల్ల దుష్ప్రభావాలను వివరించి, వాటి నుంచి విద్యార్థులను దూరంగా ఉంచడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్రను వివరించాలన్నారు. గ్రీన్ పాస్‌పోర్టు కింద అమ్మ పేరుతో ఒక మొక్కను ఆసక్తి కలిగిన విద్యార్థి ఇంటి వద్దగానీ, పాఠశాలలోగానీ, పబ్లిక్ స్థలంలోగానీ నాటేందుకు అవసరమైన మొక్కలను సిద్ధంచేయాలన్నారు. అమ్మ పేరుతో మొక్క నాటి పోర్టల్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేసిన విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్టు జారీచేయాలన్నారు. తల్లికి వందనం అంశంపై అమ్మ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించి వారి తల్లులకు పువ్వులతో పాదాభివందనం చేయించాలన్నారు. తల్లులకు పోటీలు నిర్వహించాలన్నారు.

బేబీ కిట్టు.. అందేటట్టు!



త్వరలో అందించనున్న కూటమి ప్రభుత్వం

- పాత పథకం పునరుద్ధరణ
- ప్రభుత్వాసుపత్రుల్లో అందజేత
- 2021 నుంచి నిలిపేసిన వైసీపీ
- నెలాఖరు నుంచి అమలు యోచన

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

నాడు టీడీపీ ప్రభుత్వం అందజేసిన పలు ప్రజాసంక్షేమ పథకాలను గత వైసీపీ ప్రభుత్వం రద్దుచేసింది. దీంతో చాలా మందికి ఆ పథకాలు దూరమయ్యాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. మళ్లీ తిరిగి వాటిని ప్రజలందరికీ చేర్చే కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. ప్రభుత్వ వైద్యశాలల్లో జన్మించిన చిన్నారులకు రక్షణ కల్పించేందుకు బేబీ కిట్లను పంపిణీచేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. అధికారంలో ఉన్నంతకాలం పథకాన్ని అమలుచేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకం పేరు మార్చింది. కిట్లను పూర్తిగా అటకెక్కించింది. 2021 నుంచి పూర్తిగా నిలిపివేసింది. దీంతో పేద ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. బయట కొనుగోలు చేసుకునే ఆర్థిక స్తోమత లేక అవస్థలుపడ్డారు. గతంలో తాము అధికారంలో ఉండగా అమలు చేసిన ఈ పథకాన్ని మళ్లీ అందుబాటులోకి తేవాలని కూటమి ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. దీనిలో భాగంగానే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేసుకునే బాలింతలకు ఈ కిట్లు అందజేయనుంది.

ఈ నెలాఖరు నుంచి బేబీ కిట్లు

జిల్లాల్లోని డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్, జీజీహెచ్‌లకు రెండేళ్లపాటు రేట్ కాంట్రాక్టు పద్ధతిలో కిట్లు సరఫరా చేసేలా టెండర్లు పిలిచారు. ఆ బాధ్యతను ఆంధ్ర ప్రదేశ్ వైద్యసేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ)కు ప్రభుత్వం అప్పగించింది. అర్హత కలిగిన తయారీదారులు, అధికారిక డిస్ట్రిబ్యూటర్లు ఈ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో బిడ్లు సమర్పించాలని పేర్కొంది. ఈ నెలాఖరు నుంచి ఈ బేబీ కిట్లు పంపిణీ జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏడాదికి సుమారు 50 వేల వరకు ప్రసవాలు జరుగుతున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రసవాలు జరిగితే కుటుంబ సభ్యులు కిట్లను బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి. దీని ఖరీదు రూ.1500 నుంచి రూ.2 వేల వరకు ఉంటోంది. నిరుపేదలైన వారు కొనుగోలు చేసే పరిస్థితి లేక అలాగే ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఈ ప్రభావం చిన్నారుల ఆరోగ్యంపై పడుతుంది. వివిధ రకాల రుగ్మతలతో బాధపడే అవకాశం ఉంది. అలాంటి వారికి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఎంతో మేలు కలుగుతోంది.

కిట్‌లో ఏం ఉంటాయంటే..

ఎన్టీఆర్ బేబీ కిట్‌లో 11 రకాల వస్తువులు ఉంటాయి. దీని ధర రూ.1410గా ప్రభుత్వం నిర్ణయించింది. చిన్నారి తల్లితోపాటు శిశువు నిద్రపోయేందుకు బెడ్, దోమ తెర, తల్లులు చేతులు శుభ్రం చేసుకునే ద్రావణం, సబ్బు, పౌడర్, న్యాప్‌కిన్, రెండు తువ్వాళ్లు, చిన్న బొమ్మ ఉంటాయి. ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎన్టీఆర్ బేబీ కిట్లను తిరిగి పంపిణీ చేయాలని నిర్ణయించింది.

రాజీపడితే తగ్గినట్టు కాదు.. నెగ్గినట్టు!

లోక్ అదాలత్ ప్రారంభంలో పీడీజే గంధం సునీత



బాధిత కుటుంబానికి రూ.కోటి నమూనా చెక్ అందజేస్తున్న ఉమ్మడి జిల్లా జడ్జి సునీత

రాజమహేంద్రవరం, జూలై5(ఆంధ్రజ్యోతి): సత్వర న్యాయమే లోక్ అదాలత్‌ల లక్ష్యమని.. రాజీ పడితే తగ్గినట్టు కాదని.. నెగ్గినట్టని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా శనివారం 47 బెంచ్‌లపై జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. రాజమహేంద్రవరం డీఎల్ఎస్ఏ సమావేశ మందిరంలో పీడీజే ప్రారంభించి మాట్లాడారు. రాజీమార్గం ఎప్పుడూ రాజమార్గమన్న విషయం మరువరాదన్నారు. జిల్లాలో మొత్తం 85వేల కేసులు పెండింగ్‌లో ఉండగా 60, 642 రాజీకి యోగ్యమైనవన్నారు. వీటిలో 9,272 సివిల్, క్రిమినల్, 2136 ప్రీ లిటిగేషన్ కేసులు ఉన్నాయన్నారు. పీడీజే కోర్టులో కేసు నెం.1/2025కి సంబంధించి కక్షిదారుడి కుటుంబానికి ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా చెల్లించే రూ.1.15 కోట్ల పరిహారం నమూనా చెక్కు అందజేశారు. శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 47 బెంచ్‌లపై 6,179 వేల కేసులను పరిష్కరించారు. ఇందులో సివిల్ 473, క్రిమినల్ 5,514, పీఎల్‌సీ 192 కేసులు ఉన్నాయి. రాత్రి 9.30 గంటల తర్వాత పూర్తయిన కేసుల సంఖ్యను లెక్కిస్తున్నారు. లోక్ అదాలత్‌లో బాధితులకు 18,67,73,973 పరిహారం అవార్డును చెల్లించారు.

గోదారికి ఎర్ర నీరొచ్చింది..


శనివారం.. అదేచోట..

గోదావరికి ఎర్ర నీరొచ్చింది. దీంతో గత ఆరేడు నెలలుగా గోదావరిలో నీరు లేక ఇసుక తిన్నెలతో ఉన్న గోదావరికి ఎర్రనీరు రావడంతో కళకళలాడుతోంది. గోదావరి ఎర్రనీటి కోసం రైతులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఎర్రనీరు పంట భూములలో పారిందంటే పంటలు బాగా పండుతాయని నమ్మకం. గోదావరికి ఎర్రనీరు రావడంతో పలువురు పూజలు చేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని ఆలమూరు మండలం జొన్నాడ వద్ద గోదావరిలో శుక్రవారం సాధారణ నీటిలో ఉన్న గోదావరి, శనివారం ఎర్రగోదావరి చిత్రాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది. **- ఆలమూరు**

స్కెచ్‌కు బ్రేక్!



గనుల గలీజు పని బయటపెట్టిన ఆంధ్రజ్యోతి

- లీజు దరఖాస్తుల పరిశీలనకు బ్రేక్
- వారం రోజులపాటు నిలిపివేత
- సర్వేయర్ పన్నాగానికి చెక్
- డీడీతో నేడు కాకినాడ కలెక్టర్ సమీక్ష
- కలెక్టర్‌ను కలిసిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే
- దరఖాస్తుల రద్దుకు డిమాండ్
- సర్వేయర్ వెనకేసింది రూ.కోటి పైనే

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పక్కా స్కెచ్‌కు బ్రేక్ పడింది. 'ఆంధ్రజ్యోతి'లో శనివారం పక్కాగా స్కెచ్ అంటూ వచ్చిన కథనం గనుల శాఖలో తీవ్ర కలకలం రేపింది. దీంతో ఉమ్మడి జిల్లాలో మైనింగ్ లీజుల కోసం దాఖలైన దరఖాస్తులన్నింటిని ఓ వారం పాటు పరిశీలించకుండా పక్కన పెట్టాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. రాజమహేంద్రవరంలోని గనుల శాఖ సర్వేయర్ ముందస్తు పథకంతో మైనింగ్ స్కెచ్‌లన్నీ అడ్డగోలుగా విక్రయించి అరకోటికి పైగా సంపాదించడంతో పాటు అనేక మంది దరఖాస్తుదారులకు స్కెచ్‌లే లేకుండా చేసి వారిని దెబ్బతీశాడు. అటు ఒకే స్కెచ్‌ను ఒకరికి తెలియకుండా మరొకరికి విక్రయించి అడ్డంగా బరితెగించేశాడు. రాజమహేంద్రవరం గనులశాఖ ఏడీ కార్యాలయ సర్వేయర్ మైనింగ్ స్కెచ్‌లన్నీ ముందే తన వద్దకు రప్పించి దరఖాస్తుదారులకు హెక్టారుకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు విక్రయించేసిన విషయం వెలుగులోకి తేవడం తీవ్ర కలకలం రేపింది. ఆంధ్రజ్యోతి కథనం నేపథ్యంలో అనేక మంది దరఖాస్తుదారులు తమకు సైతం స్కెచ్‌లు ఇవ్వకుండా చేసి లీజు రాకుండా కుట్రపన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరికొందరైతే తాము సదరు సర్వేయర్‌కు రూ.5 లక్షలు ఇచ్చి కొనుగోలు చేసిన స్కెచ్‌ను మరొకరికి విక్రయించడంతో నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా అనేకమంది సర్వేయర్ బాధితులు బయటకు వచ్చారు. అటు సర్వేయర్ ముందస్తు పథకంతో స్కెచ్‌ల పేరుతో దందాలు నడిపిన నేపథ్యంలో సోమవారం నుంచి పరిశీలన ప్రక్రియ ప్రారంభించాల్సిన దరఖాస్తులన్నింటిని నిలిపి వేయాలని గనులశాఖ నిర్ణయించింది. ఈలోపు జరిగిన తంతంగంపై పూర్తిస్థాయిలో వివరాలు రాబట్టాలని కాకినాడ కలెక్టర్ మైనింగ్ డీడీని ఆదేశించారు. అందులోభాగంగా స్కెచ్‌ల పేరుతో అసలు జరిగిన కథేంటనేది తేల్చాలని కలెక్టర్ నిర్ణయించారు.ఈ మేరకు ఆదివారం మైనింగ్ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. వచ్చిన దరఖాస్తుల్లో ఎన్ని స్కెచ్‌లు ఉన్నాయి? ఎంత మందికి విక్రయించారు? వసూలు చేసిందెంత? దీని వల్ల స్కెచ్‌లు దక్కక నష్టపోయిన వారెందరు? అనేది ఈ సమావేశంలో నిగ్గు తేల్చనున్నారు. తద్వారా వచ్చిన దరఖాస్తులను పూర్తిగా పక్కనపెట్టి కొత్తగా దాఖలు చేయించాలా? లేదంటే తదుపరి వ్యూహం ఏంటనేది అమరావతిలో గనులశాఖ ఉన్నతాధికారులను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలనుకుంటున్నారు. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాఖలైన 53 మైనింగ్ లీజు దరఖాస్తుల్లో 45 ఒక్క రౌతులపూడిలోని క్వారీలకే వచ్చాయి. స్కెచ్‌లు కొందరికే దక్కేలా మాయ చేసిన నేపథ్యంలో దరఖాస్తులను రద్దు చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం సాయంత్రం కాకినాడ జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. అవకతవకలు లేకుండా పారదర్శకంగా దరఖాస్తుల ప్రక్రియ మళ్లీ జరిగేలా చూడాలని కోరారు. అటు గనులశాఖ డీడీ సైతం ఆంధ్రజ్యోతి కథనాన్ని అమరావతిలోని గనులశాఖ డీఎంజీ దృష్టికి తీసుకువెళ్లారు. మరో పక్క సర్వేయర్ గలీజు దందా సంచలనంగా మారడంతో శనివారం కార్యాలయానికి సదరు ఉద్యోగి డుమ్మా కొట్టారు. ఇదంతా ఒకెత్తయితే మైనింగ్ స్కెచ్‌లను విక్రయించిన సదరు రాజమహేంద్రవరం ఏడీ కార్యాలయ సర్వేయర్ బండారం మరింత బయటపడుతోంది. మూడు రోజుల్లో స్కెచ్‌లు విక్రయించి వెనకేసింది రూ.కోటికిపైనే అని సమాచారం.తనకు ముడుపులు ముట్ట జెప్పిన దరఖాస్తుదారులకు మైనింగ్ స్కెచ్‌లు ఇవ్వడంతోపాటు ఫస్ట్ కం ఫస్ట్ విధానంలో లీజులు దక్కుతుండడంతో అవి వచ్చేలా చేయడం కోసం కొందరు లీజుదారులతో వ్యాపారంలో వాటాలు ఖాయం చేసుకోవడం విశేషం. ఇదంతా తెలిసిన అధికారులే ఖంగుతింటున్నారు.. ఇక ఆదివారం జరిగే సమీక్షలో ఏం నిర్ణయం తీసుకుంటారో..


కుమ్మరిలోవ గ్రామస్తులకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో తాగునీటి పైపులైన్ పనులు.. రహదారికి సర్వే

జిల్లాలో పోలవరానికి తొలగిన అడ్డంకులు

కుమ్మరిలోవ కొండ తొలగింపునకు సిద్ధమవుతున్న యంత్రాంగం

తునిరూరల్, జూలై5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలవరం పనులకు ప్రధాన అడ్డంకిగా మారిన కుమ్మరిలోవ సమస్య కలెక్టర్ చొరవతో ఓ కొలిక్కి వచ్చింది. కుమ్మరిలోవ నిర్వాసితులతో పలు దఫాలు చర్చలు నిర్వహించిన రెవెన్యూ అధికారులు గ్రామస్తులకు ఆమోదయోగ్యమైన పరిహారం అందజేసి ఇళ్ల స్థలాలు కేటాయించడంతో గ్రామస్తులు ఒక్కొక్కరిగా కాలనీని ఖాళీ చేస్తున్నారు. కొత్త కుమ్మరిలోవ సమీపంలో ప్రభుత్వం వీరికి కేటాయించిన స్థలాల్లో ప్రభుత్వం కరెంటు సదుపాయం, నీటి సదుపాయం, రోడ్డు ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాలనీలో కొండ తొలగింపునకు బాంబ్ బ్లాస్టింగ్‌లు జరగనుండడంతో గ్రామస్తులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని ఆదేశించగా, మంగళవారం నుంచి కొండతొలగింపు పనులు ముమ్మరం చేయనున్నారు.


సహకార జెండాను ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ రామస్వామి

ఘనంగా సహకార దినోత్సవం

కాకినాడరూరల్, జూలై5 (ఆంధ్రజ్యోతి): రైతులఅభ్యున్నతికి డీసీసీబీ నిరంతరం శ్రమిస్తుందని చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. కాకినాడలో డీసీసీబీ కేంద్ర కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన 103వ అంతర్జాతీయ సహకార దినోత్సవంలో ఆయన సహకార జెండాను ఆవిష్కరించారు. నాబార్డు డీజీఎం సోమినాయుడు, ఆప్కాబ్ ఏజీఎం బాపూజీ పాల్గొన్నారు.


వెబ్ రూమ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

వెబ్ ఎక్విప్‌మెంట్ రూమ్ ప్రారంభం

కాకినాడక్రైం, జూలై5(ఆంధ్రజ్యోతి): పోలీసు సేవలను మరింత బలోపేతం చేసేందుకు జిల్లా పోలీసుశాఖ అత్యాధునిక సాంకేతికతను అందించే దిశగా ముందడుగువేసింది. జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన వెబ్ ఎక్విప్‌మెంట్ రూమ్‌ను ఎస్పీ జి. బిందుమాధవ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లిష్టమైన కేసులను ఛేదించేందుకు పోలీసు అధికారులకు, సిబ్బందికి సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించేందుకు అత్యాధునిక సాంకేతిక పరికరాలతో కూడిన గదిని అందుబాటులోకి తీసుకొచ్చినట్టు చెప్పారు. తద్వారా మెరుగైన, నాణ్యమైన సేవలు అందించవచ్చన్నారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయ పరిసరాల్లో ఎస్పీ కొబ్బరి మొక్కలు నాటారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్ శ్రీనివాసరావు, ఏఆర్ ఆర్ఐ నరసింహమూర్తి, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

గోదారి..రంగు మారి!



ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు వరద నీరు వచ్చి గోదావరిలో కలుస్తోంది. దీంతో గోదావరి నది కొత్త రంగులో కనిపిస్తోంది. ఎర్ర నీరు ఎక్కువగా వచ్చి చేరడంతో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద గోదావరి నీరు రంగు మారిన దృశ్యాలను ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా.
– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం





స్వల్పంగా పెరిగిన గోదావరి నీటి మట్టం

1,89,129 క్యూసెక్కులు సముద్రంలోకి



ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద

ధవళేశ్వరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల వాగులు, వంకలు నుంచి వచ్చి చేరుతున్న నీటితో గోదావరి స్వల్పంగా పెరిగి ప్రవహిస్తుంది. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం ఆర్మ్‌లోని 66గేట్లు, ర్యాలీ ఆర్మ్‌లలోని 42గేట్లు, మద్దూరు ఆర్మ్‌లో 20గేట్లు, విజ్జేశ్వరాలయంలో 29 గేట్లను 40 మీటర్ల మేర పైకి ఎత్తి 1,89,129 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.80అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 4200 క్యూ సెక్కులు, మధ్యడెల్టాకు 2450క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5800 క్యూసెక్కులు చొప్పున సాగు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన భద్రాచలం వద్ద స్వల్పంగా పెరిగిన నీటి మట్టం శనివారం సాయంత్రం 20.30 అడుగులుగా నమోదైంది.

ఉరకలేస్తున్న పొల్లూరు జలపాతం



మోతుగూడెం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పొల్లూరు జలపాతం ఉరకలేస్తోంది. సుమారు 50 అడుగుల పై నుంచి నీటి ప్రవాహం కిందకు పడుతుంది. దీంతో పర్యాటకులు జలపాతం వద్ద గడిపేందుకు తరలివస్తున్నారు.

జంతుప్రేమ.. జాగ్రత్త సుమా!

పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ తప్పనిసరి
నేడు వరల్డ్ జూనోసిస్ డే



పెంపుడు కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం (ఫైల్‌ఫొటో)

కాకినాడక్రైం, జూలై5(ఆంధ్రజ్యోతి): జంతు ప్రేమికులు నానాటికి పెరుగుతున్నారు. ముఖ్యంగా శునకాలను, పిల్లులను పెంచేవారి సంఖ్య నగరాల్లో, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో క్రమంగా పెరుగుతుంది. అలాంటి పెంపుడు జంతువులకు వ్యాధులు సోకకుండా చూసుకునే బాధ్యత పెంపకందార్లపై ఉంటుంది. జూనోసిస్ వ్యాధి అనేది జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి పశువులకు వచ్చే వ్యాధి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటి వరకు 250 జూనోటిక్ వ్యాధులను గుర్తించింది. పిచ్చి కుక్క కాటుకు గురైన వ్యక్తికి 1885 సంవత్సరం జూలై 6న లూయిస్ పాశ్చర్ అనే శాస్త్రవేత్త తొలిసారి యాంటి ర్యాబీస్ టీకాను వేసి విజయం సాధించారు. ఈ కారణంగా ప్రతి సంవత్సరం జూలై 6న ప్రపంచ జూనోసిస్ డేగా జరుపుకోవడం జరుగుతోంది. ఈ వ్యాధి ప్రాణాంతకం. సాధారణంగా వ్యాక్సినేషన్ కాని జంతువు కరవడం వల్ల ర్యాబీస్ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. పిచ్చికుక్క కరిచిన నాలుగు నుంచి ఏడు వారాలలోపు ర్యాబీస్ వ్యాధి లక్షణాలు బయట పడి మనిషి మృత్యువాత పడడం ఖాయం. ఈ నేపథ్యంలో పెంపుడు కుక్కలకు అలాగే వీధి కుక్కలకు తప్పనిసరిగా యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ వేయించాలి. జూనోసిస్‌డే సందర్భంగా జూనోటిక్ వ్యాధులపై అవగాహన కల్పించడంతోపాటు ప్రతి పెంపుడు శునకానికి ప్రతి పశువైద్యశాలలో ఉచితంగా యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ వేయడం జరుగుతుంది. జిల్లాకు 28 వేలు యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్‌లు సమకూర్చినట్టు పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ కె.కృష్ణమూర్తి తెలిపారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి పశువైద్యశాలలోను యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. జంతు ప్రేమికులు తమ పెంపుడు జంతువులకు ఉచితంగా యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ వేయించి వాటిని సురక్షితంగా ఉంచడంతోపాటు వాటి యజమానులు సురక్షితంగా ఉంటారని డాక్టర్ కృష్ణమూర్తి అన్నారు.

టీడీపీ కాపు సామాజిక ప్రజాప్రతినిధుల ఆత్మీయ కలయిక



తెలుగుదేశం కాపు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆత్మీయ కలయికలో ఎంపీ సతీష్‌బాబు, వంగవీటి రాధా

సామర్లకోట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి చెందిన కాపు సామాజిక ప్రజాప్రతినిధుల ఆత్మీయ కలయిక కాకినాడ జిల్లా సామర్లకోట మండలం కొప్పవరంలోని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయ ఆవరణలో శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కాపు నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ హాజరయ్యారు. ఎంపీ సతీష్‌బాబు నేతృత్వంలో కాపు ప్రజాప్రతినిధులు కొద్దిసేపు అంతరంగికంగా సమావేశమయ్యారు. ప్రధానంగా కాపు సామాజికవర్గానికి చెందిన పలు సమస్యలను వివాదాలక తీతంగా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లేందుకు కాకినాడ జిల్లా తరపున ఎంపీ సతీష్‌బాబు సారథ్యం వహించేందుకు ఇప్పటికే రాష్ట్ర కాపు నాయకులకు సుముఖత వ్యక్తం చేసిన విషయం విదితమే. అందులో భాగంగా ముందుగా టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధులను తన క్యాంపు కార్యాలయంలో ఆత్మీయ కలయిక ఏర్పాటుచేయడమే గాక వంగవీటి రంగా తనయుడు వంగవీటి రాధాను రప్పించడంలో ఎంపీ సతీష్‌బాబు కృషిచేశారు. అదే తరుణంలో కాపు ఎమ్మెల్యేలు నిమ్మకాయల చిన రాజప్ప, జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, జ్యోతుల నవీన్‌తో కలిసి ఎంపీ సతీష్‌బాబు, వంగవీటి రాధా ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం ఆత్మీయ విందు స్వీకరించారు. విందులో టీడీపీ కాకినాడ పార్లమెంటరీ కమిటీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, పార్టీ నాయకులు ఆకుల రామ కృష్ణ, గంధం పల్లంరాజు, మోటుకూరి వెంకటేష్, అల్లాడి శరత్, చిక్కాల గణేష్, రాయపురెడ్డి రాజా, ఎస్ఎన్.రాజా, మెట్ల రమణబాబు, ఆరేటి ప్రకాష్, చింతపల్లి అర్జున్, ఆనంద్‌న్యూటన్, ఏసుదాసు పాల్గొన్నారు.

వంగవీటి రాధాకు సత్కారం

కాకినాడ జిల్లా పర్యటనకు విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణను సామర్లకోట మండలం కొప్పవరంలోని రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఎంపీ నేతృత్వంలో రాధాకు జరిగిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, జ్యోతుల నవీన్, ఆకుల రామకృష్ణ, ఆంధ్రా కాపు సద్భావనా సంఘం రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, బసవా ప్రభాకరరావు, సిద్దు నూకరాజు, గొల్లపల్లి లక్ష్మణరావు, వల్లకూడి బాబ్జీల చేతులమీదుగా జ్ఞాపికను రాధాకు అందజేశారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



మృతి చెందిన వ్యక్తి

తుని రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతిచెందిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వేస్టేషన్ శివారు 1వ నెంబరు ప్లాట్‌ఫారంపై రైలు నుంచి జారి పడి సుమారు 45 ఏళ్ల వ్యక్తి మృతి చెందినట్టు రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. వ్యక్తి నీలం రంగు చొక్కా, తెలుపు రంగు షార్ట్ ధరించి ఉన్నాడని సంబంధీకులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులను, 94906 19020 నెంబర్లో కానీ సంప్రదించాలని కోరారు.

రైల్వేస్టేషన్ల మధ్యలో..



కొవ్వూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు తాడేపల్లిగూడెం జీఆర్పీ ఎస్ఐ ప.అప్పారావు తెలిపారు. రైల్వే పోలీసులు అందించిన వివరాల ప్రకారం... శనివారం ఉదయం పశివేదల, కొవ్వూరు రైల్వేస్టేషన్ల మధ్యలో కొవ్వూరు యార్డు వద్ద సుమారు 40 ఏళ్ల వ్యక్తి గాయాలపాలై మృతి చెందినట్టు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతదేహంపై నలుపురంగు కట్ డ్రాయర్, బిస్కెట్ కలర్ షర్ట్, నలుపురంగు పారగాన్ చెప్పులు ఉన్నాయన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు జీఆర్పీ ఎస్ఐ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు 9490617090, 99480 10061లో సమాచారం అందించాలన్నారు.

అల్లూరి కలెక్టర్, గిరిజన సంక్షేమ కార్యదర్శికి జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసులు

రంపచోడవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరంలో రెవెన్యూ అధికారులు ఇటీవల చేపట్టిన ఆక్రమణల తొలగింపులో భాగంగా గిరిజనులకు చెందిన ఇళ్లను కూడా కూల్చేసిన ఘటనలపై జాతీయ ఎస్టీ కమిషన్ అల్లూరి జిల్లా కలెక్టర్, గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. రంపచోడవరానికి చెందిన ముర్ల లక్ష్మి అనే గిరిజన మహిళ రెవెన్యూ అధికారులు చట్టవిరుద్ధంగా తన ఇంటిని ఎక్స్‌కవేటర్‌తో కూల్చేసి తనకు నష్టాన్ని చేకూర్చారని ఫిర్యాదు చేశారు. ఇందుకు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం తహశీల్దార్‌గా పనిచేసిన రామకృష్ణ తదితరులు బాధ్యులని, వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును విచారణకు స్వీకరించి భువనేశ్వర్‌లోని ప్రాంతీయ కార్యాలయం అల్లూరి కలెక్టర్, గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శికి నోటీసు జారీ చేసి 30 రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించింది.

760 టన్నుల ఇసుక నిల్వలు స్వాధీనం

6 టన్నుల ఇసుకతో లారీ బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌కు అప్పగింత



దివాన్‌చెరువులో ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న అధికారుల బృందం

దివాన్‌చెరువు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువులోని బీజాపురి టౌన్‌షిప్‌లో రెండు వేర్వేరు ప్రాంతాల్లోని భారీ ఇసుక నిల్వలను టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం శనివారం స్వాధీనం చేసుకుంది. అలాగే 6 టన్నుల ఇసుకలోడ్‌తో పాటు లారీని స్వాధీనపరచుకున్నారు. వివరాల ప్రకారం.. దివాన్‌చెరువులోని బీజాపురి టూన్‌షిప్‌లో టాస్క్‌ఫోర్స్ బృందం శనివారం దాడులు చేసింది. ఆ సమయంలో ఒకప్రాంతంలో నిల్వ చేసిన 260 టన్నుల ఇసుక, మరోచోట నిల్వ చేసిన 500 టన్నుల ఇసుక మొత్తం 760 టన్నుల నిల్వలను అధికారులను స్వాధీనం పర్చుకున్నారు. దీంతో పాటు 6 టన్నుల లోడ్‌తో అక్కడికి వచ్చిన ఇసుక లారీ బిల్లులను పరిశీలించారు. అయితే ఆ బిల్లులో శనివారం ఉదయం సమయంతో ఉందని, మధ్యాహ్నం 12 గంటల వరకే ఈ బిల్లు పనిచేస్తుందని టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ కె.ఆంజనేయులు తెలిపారు. సమయం మించి సాయంత్రం కావడం వల్ల 6 టన్నుల ఇసుకతో పాటు లారీని స్వాధీనపర్చుకుని బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌కు అప్పగించామన్నారు. అలాగే దివాన్‌చెరువులోని 2 వేర్వేరు ప్రాంతాల్లో నిల్వ చేసిన 760 టన్నుల ఇసుకను స్వాధీనపర్చుకుని వీఆర్వోకు అప్పగించినట్టు మైనింగ్ శాఖ సాంకేతిక సిబ్బంది శైలజ తెలిపారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు ఇసుక నిల్వలు స్వాధీనపర్చుకున్నామన్నారు. తాను గృహనిర్మాణాలు చేసే కాంట్రాక్టర్‌నని, ఇక్కడ ఖాళీస్థలాలు ఉండడంతో గృహనిర్మాణ పనుల నిమిత్తం ఇసుకను ఇక్కడ నిల్వచేసుకున్నానని పి.వెంకటేశ్వరరావు అధికారులను కలసి వివరించాడు. వీటికి సంబంధించిన బిల్లులను తీసుకుని సోమవారం తమ కార్యాలయంలో హాజరుకావాలని శైలజ తెలిపారు. దాడుల్లో రవాణాశాఖ నుంచి గిరి, మైనింగ్ శాఖ సాంకేతిక సిబ్బంది మనీషా, దివాన్‌చెరువు వీఆర్వో డి.రామజోగి కుడా పాల్గొన్నారు.

పంటకాల్వలో పడి చేనేత కార్మికుడు మృతి



సత్యనారాయణ(ఫైల్)

ముమ్మిడివరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుడు ప్రమాదవశాత్తూ రోడ్డు పక్కన ఉన్న పంటకాల్వలో పడి మృతిచెందాడు. కోనసీమ జిల్లా ముమ్మిడివరం కాశివానితూము సెంటర్ వీవర్స్ కాలనీకి చెందిన చేనేత కార్మికుడు బొడ్డు సత్యనారాయణ (79) శనివారం తెల్లవారుజామున ఇంటి నుంచి టీ తాగుందుకు బైపాస్ రోడ్డుకు వెళ్లగా ఆ రోడ్డు పక్కన ఉన్న రాణేలంక పంటకాల్వలో అదుపుతప్పి పడి మృతిచెందాడు. అతడి సోదరుడు ప్రభాకరరావు ఫిర్యాదు చేయగా ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి సత్యనారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సత్యనారాయణ ముమ్మిడివరం చేనేత పారిశ్రామిక ఉత్పత్తి విక్రయ కేంద్రంలో సభ్యుడిగా కొనసాగుతున్నాడు.

తునిలో అగ్నిప్రమాదం

తుని రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని వీరవరపుపేటలో ఓ దుకాణంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగి ధారా కృష్ణవేణి షాపులో కిరాణా సామగ్రి ఆహుతయ్యాయి. అగ్ని మాపక సిబ్బంది మంటల్ని అదుపులోకి తీసుకొచ్చారు.

చెస్ చాంపియన్‌షిప్ విజేతగా అక్షయ

అమలాపురం రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అమలాపురం మండలం సవరప్పాలెనికి చెందిన సత్తి అక్షయ జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపికైంది. కర్ణాటకలో నిర్వహించిన ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్‌ను అక్షయ గెలుపొందినట్టు ఆమె తాతయ్య ప్రసాద్ తెలిపారు. ప్రసాద్ కుమారుడైన విజయ్‌రవిచంద్ర ప్రస్తుతం ఉత్తర, కన్నడ జిల్లాలో ఉన్న కైగా అణు విద్యుత్ కేంద్రంలో ఫైర్ అండ్ సేఫ్టీ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. అక్కడే పదో తరగతి చదువుతున్న అక్షయ కర్ణాటక ఓపెన్ చెస్ చాంపియన్ షిప్ సాధించడంతో గ్రామస్తులు హర్షాతిరేకాలు చేశారు.



విజేతగా మెమెంటో అందుకుంటున్న అక్షయ

హత్య కేసులో ఇద్దరు నిందితులకు రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణభగవాన్

సామర్లకోట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పి.వేమవరానికి చెందిన కిరణ్ కార్తీక్ హత్య కేసులో అదే గ్రామానికి చెందిన నులకతట్టి కృష్ణప్రసాద్, దుల్లపల్లి వినోద్‌ను అరెస్ట్ చేసి కోర్టు ఎదుట హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు సామర్లకోట పోలీసులు శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా యువకుడు మిస్సింగ్ పేరిట కేసు నమోదు చేయగా దర్యాప్తు అనంతరం హత్యగా నిర్ధారించబడడంతో హత్యకేసుగా మలిచినట్లు సీఐ కృష్ణభగవాన్ వెల్లడించారు. నిందితులు తామే ఈ హత్య చేసినట్లు అంగీకరించారని, దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు.

గంజాయితో నలుగురి అరెస్టు

ఐ.పోలవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ పుష్కరఘాట్ వద్ద పోలీసులు శనివారం 9 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని నలుగురు యువకులను అరెస్టు చేశారు. పుష్కరఘాట్ వద్ద నలుగురు యువకులు గంజాయితో ఉన్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు తనిఖీలు నిర్వహించారు. 9 కిలోల గంజాయి లభించింది. దీనికి సంబంధించి నలుగురు యువకులను అరెస్టు చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిలో ముగ్గురు పాతనేరస్తులుగా గుర్తించారు. ఈ కేసులో మరో వ్యక్తి పరారీలో ఉన్నట్టు, అతడి కోసం గాలిస్తున్నట్టు ముమ్మిడివరం సీఐ మోహన్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.66.31 లక్షలు



హైకోర్టు జడ్జి దంపతులకు చిత్రపటం అందజేస్తున్న ఈవో

ఆత్రేయపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి క్షేత్రం శనివారం భక్తులతో పులకించింది. భక్తులు తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రూ.66.31 లక్షల ఆదాయం లభించినట్టు ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. స్వామివారిని హైకోర్టు జడ్జి వి.వెంకటజ్యోతిర్మయి మహిమ-శ్రీనివాస్ దంపతులు దర్శించుకున్నారు. వారిని వేదపండితులు ఆశీర్వదించగా ఈవో స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్రగాయాలు

రెండు గంటలైనా ఆసుపత్రికి రాని వైద్యులు
ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే



తీవ్రగాయాలపాలైన యువకులు

రాజవొమ్మంగి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలం దూసరపాము శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రగాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దూసరపాము శివారులో ద్విచక్ర వాహనానికి గెదే అడ్డు రావడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న రాజవొమ్మంగి గ్రామానికి చెందిన గొల్లపల్లి శ్రీనివాసు, సోముల వంశీ, అనంతగిరి గ్రామానికి చెందిన దూరిపల్లి వివేక్ వర్ధన్ తీవ్ర గాయాలపాలయ్యారు. శ్రీనివాసు, వివేక్‌కు ఎడమ కాళ్లు విరిగినట్టు వైద్య సిబ్బంది ప్రాథమికంగా గుర్తించారు. ప్రమాదం తరువాత అరగంట ప్రధాన రహదారిపైనే యువకులు గగ్గోలుపెట్టారు. అనంతరం రాజవొమ్మంగి ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు లేకపోవడంతో స్టాఫ్ నర్సులే క్షతగాత్రులకు ప్రాథమిక వైద్యం అందించారు. మెరుగైన వైద్యం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించేందుకు అంబులెన్స్‌లు అందుబాటులో లేకపోవడంతో సుమారు 2 గంటలపాటు క్షతగాత్రులు రోదించారు. యువకులను కాకినాడ, రాజమహేంద్రవరం ఆసుపత్రులకు వైద్య సిబ్బంది రిఫర్ చేశారు. 2 గంటలైనా వైద్యులు అందుబాటులో లేకపోవడం తెలుసుకున్న రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులు ఆసుపత్రిలో లేకపోవడమే కాకుండా మండలంలోనే నివాసం ఉండట్లేదని తెలిసి ఘటనపైఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

లారీ ఢీకొని వృద్ధ దంపతులకు తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడ్డ వృద్ధ దంపతులు

అమలాపురం రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కామనగరువు బైపాస్ రోడ్డులో మోటారు సైకిల్‌పై వస్తున్న వృద్ధ దంపతులను లారీ వేగంగా వచ్చి ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి శివారు వాడపర్రుకు చెందిన వృద్ధ దంపతులు ముసమళ్ల దొరయ్య (67), మాణిక్యాంబ (61) వైద్య పరీక్షల కోసం మోటారుసైకిల్‌పై శనివారం అమలాపురం బయలుదేరారు. బైపాస్‌రోడ్డు జంక్షన్ దాటుతుండగా చెన్నై నుంచి కోల్‌కతా వైపు వెళుతున్న లారీ వేగంగా వచ్చి మోటారుసైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో దొరయ్య తలకు తీవ్ర గాయమైంది. మాణిక్యాంబ సైతం తీవ్రంగా గాయపడి తొలుత స్థానిక ఆసుపత్రిలో చేరారు. వైద్యుల సూచనలతో కాకినాడ ఆసుపత్రికి హుటాహుటీన తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శేఖర్‌బాబు చెప్పారు.

రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు వేళంగి విద్యార్థి



హరీష్

కరప, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేళంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థి డి.హరీష్ రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం ఆర్.త్రిమూర్తులు తెలి పారు. గత నెల 21 నుంచి 30 వరకు ఏలూరులోని సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్లో జరిగిన టీఎస్‌సీ ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్ లాంచింగ్ క్యాంప్‌లో హరీష్ ప్రతిభ కనబరిచి ఫైరింగ్ విభాగంలో కాకినాడ ఎన్‌సీసీ గ్రూపు నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హరీష్‌ను హెచ్ఎం, పీఎంసీ చైర్‌పర్సన్ ఎస్.వెంకటలక్ష్మి, సర్పంచ్ నీలిమారాజేష్, పాఠశాల అభివృద్ధి కమిటీసభ్యుడు వీరయ్యచౌదరి అభినందించారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహకాలు

గొల్లప్రోలు రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు అందజేస్తుందని ఉద్యానవన శాఖాధికారి వై.సోమరాజశేఖర్ తెలిపారు. చెందుర్తి, తాటిపర్తి, కొడవలి, వన్నెపూడి గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించారు. ఆయిల్‌పామ్ సాగు వైపు రైతులను మళ్లించాలని సూచించారు. ఉద్యానవన శాఖ సిబ్బంది, పతంజలి సంస్థ ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, కామేశ్వర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అధికారిక గుర్తింపు పత్రం అందుకుంటున్న కైట్ యాజమాన్యం

గూగుల్ క్లౌడ్ 2.0 సర్టిఫైడ్ డిజిటల్ క్యాంపస్‌గా 'కైట్'కు గుర్తింపు

కాకినాడ రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గూగుల్ క్లౌడ్ 2.0పై సర్టిఫైడ్ డిజిటల్ క్యాంపస్‌గా కైట్‌కు గుర్తింపు లభించింది. బెంగళూరులోని గూగుల్ సంస్థ కార్యాలయంలో కైట్ సిబ్బంది ఈ ఒప్పందం కుదుర్చుకున్నారని ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. దీంతో విద్యార్థులకు క్లౌడ్ ప్లాట్‌ఫామ్స్ ఏఐ, ఎంఎల్ మాడ్యూల్స్, గూగుల్ వర్చువల్ ల్యాబ్స్ వంటి ఆధునిక సాంకేతికతలపై ప్రాక్టికల్‌గా అవగాహన, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన సర్టిఫికేషన్లు పొందే అవకాశం లభించనుంది. విద్యార్థులు గ్లోబల్ టెక్ రంగంలో పోటీకి సిద్ధంగా మారతారని, అధ్యాపకులు ఈ టూల్స్ రిసోర్సెస్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకునేందుకు ప్రత్యేక శిక్షణ పొందుతారన్నారు. గూగుల్ టీమ్‌లోని రాహుల్, కిరణ్, ప్రియాంక, మల్లేష్, కైట్ ఇంజనీరింగ్ కళాశాలల చైర్మన్ పోతుల విశ్వం దూరదృష్టి వల్లే ఇది సాధ్యమైందని కైట్ విద్యా సంస్థల డైరెక్టర్ ఐశ్వర్య, ప్రిన్సిపాల్ రేవతి తెలిపారు.



నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం అందిస్తున్న సాయిరామ్

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాకి నాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తొలి తిరుపతికి శనివారం భక్తులు పోటెత్తారు. శృంగారవల్లభ స్వామికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 10వేల మంది స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. ఒక్కరోజు వివిధ సేవల ద్వారా రూ.3,84,962 ఆదాయం వచ్చిందని ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం ముక్కినాడ గ్రామానికి చెందిన అన్నదాసు సాయిరామ్-స్వాతీమణి దంపతులు రూ.1,08,000 లక్షలు విరాళం అందజేశారు.

'పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి'

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని ఏపీఎస్‌జీఆర్‌ఈ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శాస్త్రి కోరారు. సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కె.పద్మనాభం అధ్యక్షతన శనివారం నెలవారీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25కి గాను ఇన్‌కంటాక్స్ అసెస్‌మెంట్ రిటర్న్స్ సెప్టెంబరు 15లోగా సమర్పించాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు శాస్త్రి మాట్లాడుతూ ఈహెచ్‌ఎస్‌పై క్యాష్‌లెస్ వైద్యం అందట్లేదని, ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం నిర్వహించిన వైద్య శిబిరంలో పలువురికి వైద్య సేవలు అందించారు. ప్రధాన కార్యదర్శి టి.నూకరాజు, కోశాధికారి శేషగిరి, కిరణ్, జీవీ రావు, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎన్.వెంకటరావు, సీహెచ్‌బీ సరోజిని, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి కాకినాడలో ఏపీ కాగ్ సదస్సు

కాకినాడ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గైనకాలజీలో ఆధునిక విధానాలు-ఉపయోగాలు-పర్యవసానాలు' అంశంపై ఈ నెల 11, 12, 13 తేదీల్లో కాకినాడలోని గోదావరి కళాక్షేత్రంలో ఏపీ కాగ్-2025 సదస్సు నిర్వహిస్తున్నట్టు కాకినాడ సిటీ గైనకాలజిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ అనురాగమయి, కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ గీతశ్రీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, వర్క్‌షాప్ ఇన్‌చార్జి, టీడీపీ ఆరోగ్య విభాగం రాష్ట్ర సభ్యుడు డాక్టర్ కొండమూరి సత్యనారాయణ వెల్లడించారు. శనివారం వారు సంబంధిత బ్రోచర్‌ను ఆవిష్కరించారు. గైనిక్ వైద్యులు బి.శ్రీధర్, జి.రవికుమార్, లక్ష్మీకిరణ్, ఎల్.సత్యవతి, కరుణ, ఉషశ్రీ పాల్గొన్నారు.



చైర్మన్ సత్యరామకృష్ణను అభినందిస్తున్న ఆర్యవైశ్య సేవా సంఘం సభ్యులు

వాసవికన్యకాపరమేశ్వరి దేవస్థానం చైర్మన్‌గా సత్యరామకృష్ణ

పెద్దాపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వాసవి కన్యాకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం చైర్మన్‌గా పైడా సత్యరామకృష్ణ శనివారం ప్రమాణం చేశారు. దేవస్థానం అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానని ఆయన చెప్పారు. 28 సంవత్సరాలుగా చైర్మన్‌గా కొనసాగిన కేదారిశెట్టి వెంకట్రావును సత్కరించారు. మట్టే సత్య ప్రసాద్, శ్రీనివాస్, ఆదీష్, రాజేష్, దేవత రాజేష్ కుమార్, ఆర్యవైశ్య సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రచయిత, దర్శకుడు ప్రతాప్‌రెడ్డి, సహ దర్శకుడు శ్రీనివాసరావు

'సంప్రదాయ, కుటుంబ కథా చిత్రాల నిర్మాణం సమాజానికి ఎంతో అవసరం'

పెద్దాపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో యువత పెడదోవ పడుతోందని, ఈ నేపథ్యంలో సంప్రదాయ, కుటుంబ కథా చిత్రాల నిర్మాణం ఎంతో అవసరమని ప్రముఖ రచయిత, దర్శకుడు భీమవరపు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన సహ దర్శకుడు మేడపాటి శ్రీనివాసరావుతో కలిసి తొలి తిరుపతిలోని శృంగారవల్లభ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఆలయ చరిత్రతో కూడిన సంప్రదాయ, కుటుంబ కథా చిత్రాన్ని త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తానని చెప్పారు. విశాఖ, రాజమహేంద్రవరం, యానాం తదితర ప్రాంతాల్లో నూతన నటీనటులతో చిత్రాన్ని నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో శర్మ, ఈవో వడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మత్స్యకార సంఘాలు బలోపేతం కావాలి: ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు రంగారావు

కాకినాడ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను మత్స్యకార సంఘాలు సద్వినియోగం చేసుకుని బలోపేతం కావాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బలసాడి రంగారావు పేర్కొన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా శనివారం కాకినాడ జగన్నాథపురంలోని ఎస్ఐఎఫ్‌టీలో జిల్లా మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రంగారావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా మత్స్య శాఖ అదనపు డైరెక్టర్, ఎస్ఐఎఫ్‌టీ ప్రిన్సిపాల్ డాక్టర్ అంజలి, అతిథులుగా మత్స్య శాఖ జిల్లా అధికారి వి.కృష్ణారావు, మత్స్య శాఖ ఏడీ, మేనేజింగ్ డైరెక్టర్ ఎం.కరుణాకర్ విచ్చేశారు. సహకార సంఘాల ప్రాముఖ్యత, సాధించిన ప్రగతిని ప్రిన్సిపాల్ అంజలి వివరించారు. మత్స్య శాఖ అధికారి కృష్ణారావు మాట్లాడుతూ మత్స్య సహకార సంఘాలు రికార్డుల నిర్వహణ, ఆడిట్ విషయాల్లో అవగాహన కలిగి పటిష్టంగా ముందుకు వెళ్లాలన్నారు. అధ్యక్షుడు రంగారావు మాట్లాడుతూ మత్స్య సహకార సంఘాలకు వేలం లేకుండా పంచాయతీ చెరువులు లీజుకు ఇచ్చేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమన్నారు. ఉమ్మడి జిల్లా పరిషత్ సమావేశాలకు తనను ఆహ్వానితుడిగా నియమించినందుకు మత్స్యకార అధికారులకు రంగారావు కృతజ్ఞతలు తెలపగా ఆయన్ని శాలువాతో సత్కరించారు. సమావేశంలో జిల్లాలోని వివిధ మత్స్య సహకార సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

'బూత్ స్థాయి నుంచీ కాంగ్రెస్ బలోపేతానికి కార్యాచరణ రూపొందించాలి'

కాకినాడ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కార్యచరణ రూపొందించుకోవాలని కాకినాడ జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి మేడా సురేష్ కోరారు. డీసీసీ కార్యాలయంలో శనివారం జిల్లా కాంగ్రెస్ కమిటీ నెలవారీ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జి సురేష్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టే దిశగా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి, ఏఐసీసీ సభ్యుడు మల్లిపూడి రాంబాబు, పీసీసీ ఉపాధ్యక్షుడు మట్టా శివ ప్రసాద్, పీసీసీ ప్రధాన కార్యదర్శి నక్క సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి మరోతి శివగణేష్, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు నీరుకొండ సత్యనారాయణ, తుమ్మల దొరబాబు, పిల్లి సత్యవతి చిన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాష్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు, నాయకులు దాట్ల గాంధీరాజు, ధర్నాలకోట శ్రీను, పబ్బినీడి కృష్ణ, దవులూరి ధనకోటి, బత్తుల లలిత, కొత్త అప్పారావు, బావిశెట్టి సత్యనారాయణ, కొండా శ్రీను, ఇంటి వీరభద్రరావు, చంద్రమౌళి, వెంకటరత్నం, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం

కాకినాడ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఇంద్రపాలెం ప్రాంతానికి చెందిన కొప్పిశెట్టి చిరంజీవి 2021లో కొవిడ్‌తో మృతి చెందాడు. అతని కుమార్తె (3వ తరగతి) విహారిక కృష్ణ చదువు నిమిత్తం కాకినాడకు చెందిన వ్యాపారవేత్త ఉత్తమ్ పరేఖ్ దంపతులు శనివారం రూ.19,500 ఆర్థిక సాయం ప్రకటించారు. మెయిన్‌రోడ్‌లోని శ్రీయువసేన బ్లడ్ బ్యాంక్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని తల్లి సుజాతకు నగదు అందజేశారు. శ్రీయువసేన బ్లడ్ బ్యాంక్ అధ్యక్షుడు బొల్లం సతీష్, చామంతి చక్రి, శ్రీదేవి, రాకేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వారాహి నవరాత్రి మహోత్సవాలు

పిఠాపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): శృంగేరీ శంకర మఠం నిర్వహణలో పట్టణంలోని పెద్ద బజారులో వేంచేసియున్న మహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో వారాహి నవరాత్రి మహోత్సవాలు శనివారం సాయంత్రం ముగిశాయి. ఈ సందర్భంగా హోమ మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు ఇంద్రగంటి వెంకట గోపాలకృష్ణ ఆధ్వర్యంలో మహాలక్ష్మి, వారాహి అమ్మవార్లకు కుంకుమ పూజలు, సహస్ర నామార్చన జరిగాయి. భక్తులకు మహాన్నదాన ప్రసాద వితరణ చేశారు.

మహాలక్ష్మి, వారాహి అమ్మవార్లకు కుంకుమార్చన

పిఠాపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చింతా వారి వీధిలో కొలువై ఉన్న మహాలక్ష్మి గణపతి సహిత సీతారామాంజనేయస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు జరిగాయి. వారాహి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా మహాలక్ష్మి, వారాహి అమ్మవార్లకు జరిగిన కుంకుమార్చనల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మరిడమ్మ దేవస్థానంలో బుక్కా సంబరం

పెద్దాపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా శనివారం మరిడమ్మ అమ్మవారికి గరగల నృత్యాలు, మేళతాళాలతో బుక్కా సంబరం నిర్వహించారు. సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి, రమణ, గద్దే క్రాంతివీర్ తదితరులు పాల్గొన్నారు.

దారి వివాదంపై కేసు నమోదు

కరప, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేళంగిలో ఇరువర్గాల మధ్య తలెత్తిన దారి వివాదంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తోట సునీత తెలిపారు. గ్రామానికి చెందిన మెర్ల విజయభారతికి తన ఇంటి వెనుకనున్న ఖాళీ స్థలంలోకి వెళ్లడానికి దారి ఉండగా పక్కనే ఉన్న మెర్ల శ్రీమన్నారాయణ, మెర్ల శ్రీనివాస్ ఆమెను అడ్డుకుని అసభ్య పదజాలంతో దూషించారు. అక్కడకు వచ్చిన ఆమె సోదరుడు వీరరఘురాంపై దాడికి యత్నించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వివరించారు.

ఆలయ హుండీలో నగదు చోరీ

కరప, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నడకుదురులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీని గుర్తు తెలియని వ్యక్తులు పగులకొట్టి రూ.3వేల నగదు అపహరించుకుపోయినట్టు ఎస్ఐ తోట సునీత తెలి పారు. ఈ నెల 3వ తేదీ రాత్రి జరిగిన ఈ ఘటనపై ఆలయ నిర్వాహకుడు గొల్లపల్లి చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

నీటి తీరువా వసూళ్ల లక్ష్యాలు చేరుకోవాలి: ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నీటి తీరువా వసూళ్ల లక్ష్యాలు చేరుకోవాలని కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు ఆదేశించారు. రెవెన్యూ అంశాలపై శనివారం ఆయన డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నీటి తీరువా వసూళ్లకు సంబంధించి వ్యవసాయ, జలవనరుల శాఖల అధికారులను సమన్వయం చేసి నిర్దిష్ట గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ప్రజా సాధికారిక, పీజీఆర్ఎస్, 22ఏ దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. రీ సర్వేకు సంబంధించి జాయింట్ ఎల్‌పీఎంలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఇళ్ల స్థలాలు, భూ ఆక్రమణలు, కోర్టు కేసులపై చర్యలు తీసుకోవాలన్నారు. సర్వే దరఖాస్తులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో పరిపాలనాధికారి డీబీఏ చైనులు, డిప్యూటీ తహసీల్దారు కృష్ణ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బర్మా వలసదారుల స్థలం పరిశీలన

సర్పవరం జంక్షన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం సర్పవరం ఆటోనగర్‌లో బర్మా నుంచి వలస వచ్చిన వారి కోసం ప్రభుత్వం ఏర్పాటుచేసిన బర్మా రీపారియేట్స్ ఇండస్ట్రీ కో-ఆపరేటివ్ సొసైటీకి చెందిన స్థలాన్ని శనివారం సెరీకల్చర్ జిల్లా అధికారి పాలరాజు, తహసీల్దారు ఎస్ఎల్ఎన్ కుమారి, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు పరిశీలించి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా పాలరాజు మాట్లాడుతూ పట్టుపరిశ్రమ సాగుకు కేటాయించిన ఎకరం స్థలం ఫీల్డ్‌లో ఉందన్నారు. దీనిని సర్వే అనంతరం స్వాధీనం చేసుకుని సరిహద్దు రాళ్ల నాటించి ఎస్సీ కార్పొరేషన్‌కి అప్పగిస్తామన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఏఈవో వీవీఎస్ఎన్ మూర్తి, మండల సర్వేయర్ రామకృష్ణ, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.



సత్యవతి నేత్రాల దానం

తాళ్లరేవు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు గ్రామానికి చెందిన దాసరి సత్యవతి (58) శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో సత్యవతి కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు దానం చేశారు. ఐ బ్యాంక్ సిబ్బంది కార్నియాలను సేకరించారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 175 కేసులు పరిష్కారం

పిఠాపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టుల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 175 కేసులను పరిష్కరించారు. 12వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీహరి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు, జూనియర్ సివిల్ జడ్జి ఎం.విజయరామేశ్వరి ఆధ్వర్యంలోని బెంచీల ముందుకు 340 కేసులు వచ్చాయి. వీటిలో ఎంవీఓపీ కేసులు 22, సివిల్ కేసులు 37, బ్యాంకు కేసు 1, క్రిమినల్ కేసులు 115 పరిష్కారమయ్యాయి. పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగు రాజారావు, న్యాయవాదులు ఏకేవై రెడ్డి, బీవీఎస్ఎన్ రాజు, అల్లాడి గీత తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో 429 కేసులు...

పెద్దాపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 429 కేసులు పరిష్కారమయ్యాయని ఏడవ అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళీశ్వరి తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి దీపా దైవకృప, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవీరత్నకుమారి, అడ్వకేట్ మెంబర్లు కేఎంఎల్ గణేష్, ప్రసాద్, ఎస్కే వల్లీబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై అసభ్యకర పోస్టులు

పిఠాపురం పట్టణ పోలీసులకు జనసేవా సంఘం ఫిర్యాదు

పిఠాపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌నుద్దేశించి సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై జనసేన నాయకులు, జనసేవా సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు కరణం సూరిబాబు, బొజ్జా రామప్రసాద్ శనివారం రాత్రి పిఠాపురం



పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రకాశం జిల్లా పర్యటన సందర్భంగా డిప్యూటీ సీఎం చేసిన ప్రసంగం వీడియో పోస్టు చేస్తూ తమ్మ రవికృష్ణ అసభ్యకర, అభ్యంతరమైన వ్యాఖ్యలు చేశారన్నారు. పవన్‌కల్యాణ్ తండ్రిని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారని తెలిపారు. ఫేస్‌బుక్‌లో రాయలసీమ రౌడీ ఐడీతో ఉన్న వ్యక్తి కూడా దారుణమైన వ్యాఖ్యలు చేశారని చెప్పారు. ఇవి పవన్‌కల్యాణ్ వ్యక్తిత్వాన్ని కించపరిచే విధంగా ఉండటంతో పాటు జనసైనికుల మనోభావాలను దెబ్బతీశాయని తెలిపారు. సదరు వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ఎస్ఐ మణికుమార్‌ను కోరారు.

మునిసిపల్ డీఈఈగా రాజు బాధ్యతల స్వీకారం



పిఠాపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోనుకుమాటి రాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రాజమహేంద్రవరం టిడ్కో డీఈఈగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

పద్దాలమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు

పెద్దాపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కట్టమూరులో పద్దాలమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రాధాకృష్ణ

రంగా విగ్రహావిష్కరణ

సామర్లకోట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.మేడపాడులో వంగవీటి రంగా విగ్రహాన్ని ఆయన తనయుడు రాధాకృష్ణ శనివారం సాయంత్రం ఆవిష్కరించారు. గ్రామ యువజన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజా, ఎంపీ సానా సతీష్‌బాబు, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), పాలకుర్తి శ్రీనుబాబు, జ్యోతుల నవీన్ హాజరై రంగా విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు.



వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన

తాళ్లరేవు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం పెరగడంతో ఆర్డీవో ఆదేశాల మేరకు అధికారులు మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలను శనివారం పరిశీలించారు. పిల్లంక శివారు కొత్తలంక, ఇంజరం శివారు అరటికాయలంక గ్రామాల్లో ఏటిగట్లను తహసీల్దారు త్రినాథరావు, డిప్యూటీ ఎంపీడీవో ప్రకాష్, ఆర్ఐ రామకృష్ణ, పంచాయతీల కార్యదర్శులు పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

తలుపులమ్మకు పంచామృతాభిషేకం

తుని రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానంలో ఆషాఢ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని తల్లి మూల విరాట్‌కు శనివారం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు ఆచరించారు.



జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

'ఎమ్మెల్యే శిరీషపై ఆరోపణలు తగవు'



ఎటపాకలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఎటపాక, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవిపై మాజీఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని,ఆమెకు చిత్తశుద్ధి ఉంటే ఆరోపణలను ఆధారాలతో నిరూపించాలని వైస్‌ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు పుట్టి రమేష్ సవాల్ విసిరారు. శనివారం ఎటపాకలో టీడీపీ నేతలు నలజాల శ్రీకాంత్ చౌదరి, మోసంరాజులు, పాటి చలపతి, సొసైటీ అధ్యక్షుడు మాచినేని రాజేష్, పాటి చలపతి, బాచినేని శ్రీకాంత్, నలజాల మధు, పాయందేవీ, కణితి మధు, తదితరులు మాట్లాడారు.

చింతూరు: ఎమ్మెల్యే మిరియాల శిరీషపై మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి విమర్శలు చేయడం తగదని చింతూరు మండల టీడీపీ అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రతి పల్లెను అభివృద్ధి చేయడమే టీడీపీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు, ఆసిఫ్, నర్సింహరావు, సురేష్‌చౌదరి, తమ్మయ్య, శ్రీరామ్మూర్తి, రామారావు, సత్యవతి, నాగలక్ష్మి, అచ్చమ్మ పాల్గొన్నారు.

దేవీపట్నం: అవినీతి, దోపిడీ మీకే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిపై దేవీపట్నం మండల టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. శనివారం ఇందుకూరుపేట టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడారు. సమావేశంలో టీడీపీ మండల కన్వీనర్ మరిశెట్ల వెంకటేశ్వరరావు, బాబూరావు, మధు, చంటిబాబు, కుంజం శివ, సర్పంచ్ రాజామణి, పోసమ్మ, రేలంగి రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి : పీవో



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం బందపల్లి గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అమలు చేయాలన్నారు. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే ఆసుపత్రులలో చేర్పించి వైద్యం అందించాలన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులకు ఆటపాటలతో విద్యను నేర్పించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలిద్దాం : సబ్‌కలెక్టర్



మాట్లాడుతున్న కల్పశ్రీ

రంపచోడవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సబ్‌కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ అన్నారు. శనివారం ఆమె వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ నివారణకు పర్యాటక ప్రాంతాలలో డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు సీహెచ్‌కేవీ చౌదరి, సావిత్రి, సీఐ రవికుమార్, అటవీ, వ్యవసాయశాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వరదలపై అప్రమత్తత అవసరం

ఎటపాక,జూలై 5 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరదలపై అప్రమత్తంగా ఉండాలని, వరదల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని తహశీల్దార్ కారం సుబ్బారావు, ఎంపీడీవో ఇ. ప్రేమ్‌సాగర్ సూచించారు. శనివారం ఎటపాకలో ముందస్తు గోదావరి, శబరి వరదలపై ప్రణాళికలు, సూచనపై ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పలువురు మాట్లాడారు. జడ్పీటీసీ ఉబ్బానుస్మిత, ఎస్‌ఐ అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి ఎప్పుడైనా...

సొంత నిర్ణయాలు తీసుకున్నావా?

కూనవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి పాలనా విషయంలో ఎప్పుడూ తన సొంత నిర్ణయాలు తీసుకోలేదని, ఎమ్మెల్సీ అనంతబాబు అడుగుజాడల్లో నడిచిన గత ఐదేళ్లు ఉత్సవ విగ్రహంగా ఉన్నారని కూనవరం మాజీ జడ్పీటీసీ ఎడవల్లి కన్యకాపరమేశ్వరి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవిని విమర్శించే స్థాయి ధనలక్ష్మికి లేదన్నారు. గోదావరి వరదల సమయంలో ప్రతి ఒక్కరికీ కూటమి ప్రభుత్వం పరిహారం చెల్లించిందన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన శిరీషదేవి అసెంబ్లీలో అడుగుపెట్టిన తొలి అడుగులోనే నిర్వాసితుల పక్షాన మాట్లాడిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ తోటకూరి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు పోడియం అప్పారావు, గడ్డిపాటి ప్రసాద్, బరపాటి ప్రకాష్‌రావు, గడేసుల ప్రేమ్‌చంద్, చలకాని ఉమా, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

గిరిజన ప్రాంత అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

రంపచోడవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నియోజకవర్గ అభివృద్ధి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆమె సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీతో కలిసి స్వర్ణాంధ్ర విజన్-2047పై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన ప్రాంత అభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాయన్నారు. మారేడుమిల్లి మండలంలో పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ విజన్ 2047 స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దేందుకు వివిధ శాఖల అధికారులు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి సమర్పించాలన్నారు.కార్యక్రమంలో జీసీసీ డైరెక్టర్ జీఎస్ సునీత, డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు గాబ్రియేల్, రవికుమార్, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు సీహెచ్ కేవీ చౌదరి, కె.సావిత్రి, డిప్యూటీ తహశీల్దార్ స్వామి, అటవీ శాఖాధికారులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సబ్‌కలెక్టర్

రంపచోడవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి):రంపచోడవరం పోలీసు స్టేషన్‌ను సబ్ కలెక్టర్ కల్పశ్రీ శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ స్టేషన్లో ఓ ఉద్యోగిని ఉంచారన్న అంశంపై స్వయంగా ఆమె పోలీసుస్టేషన్‌కు వచ్చి ఆరా తీశారు. తాము ఎవరినీ అక్రమంగా తీసుకురాలేదని, తమకు వచ్చిన ఓ ఫిర్యాదుపై మాత్రమే సదరు ఉద్యోగిని విచారించామని డీఎస్పీ సాయిప్రశాంత్, సీఐ రవికుమార్, తదితరులు వివరించారు. ఈమెతో పాటు అధికారులు ఉన్నారు.

కూటమి పాలనలో ప్రజల సంతృప్తి

- జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ
- పలుచోట్ల సుపరిపాలన కార్యక్రమాలు





జగ్గంపేట: కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ, రౌతులపూడి: మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

జగ్గంపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో అమలవుతున్న అభివృద్ధిపై ప్రజల్లో సంతృప్తి కనిపిస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. శనివారం జగ్గంపేట మర్రి మొక్క వీధిలో టీడీపీ జగ్గంపేట పట్టణాధ్యక్షుడు పాండ్రంగి రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రజలకు ఏడాది సుపరిపాలన తొలిఅడుగు కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజలతో మాట్లాడారు. అందుతున్న సంక్షేమం, జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. రాబోయే నాలుగేళ్లలో జగ్గంపేటకు శుద్ధి చేసిన మంచినీరు, రైతులకు సాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్యం, వాకింగ్‌ట్రాక్, యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలు కూడా స్థాపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, వేములకొండ జోగారావు, కొండ్రోతు శ్రీను, కింగం రమణ, సుంకర బ్రదర్స్, సుందక బ్రదర్స్, మారిశెట్టి గంగ పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనతో ప్రజల హర్షాతిరేకాలు

రౌతులపూడి, జూలై 5(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సుపరిపాలనలో ప్రజలందరూ ఆనందంగా ఉన్నారని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా దిగిశివాడలో శనివారం ఆమె టీడీపీ నాయకులు పంచాడ బుజ్జి, చిటి కెల అడవిరాజులతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే నా దృష్టికి తీసుకురండి వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కారిస్తానని తెలిపారు. ఎమ్మెల్యేకు మహిళలు, ప్రజలు హారతులు, పూలతో స్వాగతం పలికారు. బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంటిమళ్ల రాజ్య లక్ష్మి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, సింహాద్రి పెదబాబు, కోసూరి కృష్ణవర్మ, చింతకాయల రాజు బాబు, పైల సాంబశివరావు, పసగడుగుల రమణ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు రూట్ మ్యాప్ తయారు



యల్లమిల్లిలో బస్సు రూట్ మ్యాప్‌ను నాయకులకు చూపిస్తున్న ఆర్టీసీ డీఎం సత్యనారాయణ

గండేపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం డిపో నుంచి గండేపల్లి మండలంలోని కాట్రావులపల్లి, సూరంపాలెం, యల్లమిల్లి మీదుగా వయా రాజమండ్రికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామస్తులు ఇటీవల జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు వినతిపత్రం అందజేశారు. దీంతో ఆయన వెంటనే స్పందించి ఉన్నతాధికారులకు ఈఅంశాన్ని పరిశీలించాలని సూచించారు. శనివారం ఆర్టీసీ డీఎం జి.సత్యనారాయణ, ఆర్టీసీ అధికారి ఏవీఎస్ నారాయణ యల్లమిల్లికి విచ్చేసి బస్సు సౌకర్యం కల్పించేందుకు రోడ్డు మ్యాప్ తయారుచేశారు. యల్లమిల్లి టీడీపీ గ్రామఅధ్యక్షుడు సుంకవిల్లి వీరవెంకట సత్యనారాయణ మాట్లాడుతూ బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే నెహ్రూకు తెలిపిన వెంటనే స్పందించి అధికారులను పంపడం ఆనందంగా ఉందన్నారు. ఈ బస్సు సౌకర్యంతో ఇరు గ్రామస్తులకు ప్రయాణం సులభతరమవుతుందన్నారు. కార్యక్రమంలో మద్దుపూడి సత్యనారాయణ, మాదిరెడ్డి కృష్ణార్జున, దేవిశెట్టి బాబ్జి, నల్లబాబు ఉన్నారు.

ఉన్నత పాఠశాలలో వనమహోత్సవం

తొండంగి, జూలై 5(ఆంధ్రజ్యోతి): పెరుమాళ్లపురం ఉన్నత పాఠశాల నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో శనివారం వనమహోత్సవం నిర్వహించారు. పెరుమాళ్లపురం కెనరా బ్యాంకు వార్షికోత్సవాల సందర్భంగా హాజరైన బ్యాంకు మేనేజరు వీరభద్రరావు మాట్లాడుతూ వివరిస్తూ విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. హెచ్‌ఎం చాట్రాతి సత్యనారాయణ, ఎస్‌ఎంసీ చైర్మన్ బద్ది రాంబాబు మొక్కల ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, నవీన్

జగ్గంపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): గోకవరం రోడ్డులోని మోడ్రన్ డిగ్రీ కళాశాలలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్, వికాస ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అభ్యర్థులను పలకరించారు. వికాస పీడీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో జగ్గంపేట నియోజకవర్గం నిరుద్యోగులందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని 33బ్రాండెడ్ కంపెనీలతో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు 1,206మంది అభ్యర్థులు హాజరయ్యాయని, 800 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని తెలిపారు. ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ వికాస ఉద్యోగాలు అందిపుచ్చుకుంటే తల్లిదండ్రుల ఆనందానికి అవధులు ఉండవని, అందుకే ఈ చిరుప్రయత్నం చేస్తున్నామన్నారు. జ్యోతుల నవీన్ మాట్లాడుతూ నియోజవర్గంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వికాస ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అడపా భరత్ బాబు, తోట రవి, తోట గాంధీ, కొత్త కొండబాబు, అడబాల భాస్కరరావు, బస్వా వీరబాబు, మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, చదరం చంటిబాబు, నీలం శ్రీను పాల్గొన్నారు.

చిన్నారులకు ఎంపీడీవో అండ



ముగ్గురు చిన్నారులతో ఎంపీడీవో రాజేశ్వరరావు

తొండంగి, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో రాజేశ్వరరావు అనాథలైన చిన్నారులకు అండగా నిలిచారు. జీఎంపేట గ్రామానికి చెందిన సిరిపిన కోటేష్, దుర్గ కొవిడ్ మహమ్మారికి బలయ్యారు. వారి చిన్నారులైన సంతోషి, చిన్నారి, యామిని అనాథలయ్యారు. వారిలో సంతోషి ఏడో తరగతి, చిన్నారి ఐదో తరగతి పిఠాపురం గవర్నమెంట్ హాస్టల్‌లో చదువుతున్నారు. మూడేళ్ల యామిని మాత్రం అమ్మమ్మ వద్ద ఉంటోంది. వారికి ఉండడానికి ఇల్లు కూడా లేదు, కూలిపని చేసుకునే నానమ్మ కొండమ్మకు పింఛను కూడా రాకపోవడంతో పింఛను ఇప్పించాలని ముగ్గురు పిల్లలతో ఎంపీడీవోను కలిసింది. దీంతో రాజేశ్వరరావు రూ.10వేల అందించేందుకు నిర్ణయించుకున్నారు. మండల సచివాలయ, ఉపాధి తదితర గ్రూపుల్లో విషయాన్ని పోస్టుచేశారు. వారంతా రూ.50వేల వరకూ సహాయాన్ని అందించారు. పభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేస్తే పింఛన్ ఇస్తానని ఆమెకు ఎంపీడీవో హామీ ఇచ్చారు.



ఏలేరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేరు నుంచి ఖరీఫ్‌కు నీరు విడుదల

ఏలేశ్వరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరంలోని ఏలేరు రిజర్వాయర్ నుంచి ఖరీఫ్ పంట సాగు నిమిత్తం నీరు విడుదల కార్యక్రమాన్ని శనివారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. ప్రాజెక్టు నుంచి మెట్ట ప్రాంతానికి 800 క్యూసెక్కులు, తిమ్మరాజు చెరువుకు 200 క్యూసెక్కులు చొప్పున నీటి విడుదలకు శ్రీకారం చుట్టారు. ఎప్పటికప్పుడు నీటి విడుదల ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. ఏలేరు ప్రాజెక్టు చైర్మన్ బస్వా వీరబాబు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు అలమండ చలమయ్య, మూది నారాయణస్వామి, బొదిరెడ్డి గోపి పాల్గొన్నారు.

9న సమ్మెను విజయవంతం చేయండి

ప్రత్తిపాడు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న 4 లేబర్ కోడ్లు రద్దు చేసిన కార్మిక చట్టాలు అమలు చేయాలని ఈనెల 9న జరుగుతున్న సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ ప్రత్తిపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మండల కార్యాలయం వద్ద సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యదర్శి అల్లాడి లక్ష్మి, గనిలక్ష్మి, ఆశావర్కర్స్ నాయకులు వెంకటలక్ష్మి, సత్యవేణి పాల్గొన్నారు.

తునిలో వైసీపీ సమావేశం

తునిరూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తుని శివారులో శనివారం వైసీపీ తుని నియోజకవర్గ సమావేశం జరిగింది. వైసీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి వైసీపీ కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజాపై ఇటీవల యనమల రామకృష్ణుడు చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. కార్యక్రమంలో యనమల కృష్ణుడు, పలువురు వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్, విజిలెన్స్ అధికారుల తనిఖీలు



ఎస్.పైడిపాలలో క్వారీ పరిశీలిస్తున్న విజిలెన్స్, మైనింగ్ అధికారులు

రౌతులపూడి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లరాయి క్వారీలను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఆదేశాల మేరకు మైనింగ్, విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. విజిలెన్స్ డీఎస్పీ బంగార్రాజు ఆధ్వర్యంలో అధికారుల బృందం పర్యావరణ అనుమతులపై తనిఖీలు చేశారు. అనధికార క్వారీల్లో ఇప్పటి వరకూ ఎంత నల్లరాయి కొట్టారు, పర్యావరణ అనుమతులపై క్వారీలను పరిశీలించారు. మరో రెండు రోజులపాటు తనిఖీలు చేసి పూర్తి నివేదికనుఉన్నతాధికారులకు పంపించనున్నట్టు డీఎస్పీ తెలిపారు.

అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలి

ప్రత్తిపాడు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని పెద్దాపురం డీఎల్‌పీవో బాలామణి కోరారు. మండలంలోని ధర్మవరం గ్రామ పంచాయల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను శనివారం డీఎల్‌పీవో పరిశీలించారు.

వాకపల్లిలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

ప్రత్తిపాడు, జూలై 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏడాది సుపరిపాలనలో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని టీడీపీ కాకినాడ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, సుబ్బారెడ్డి సాగర్ చైర్మన్ ఇళ్ల అప్పారావు, మండలాధ్యక్షుడు అమరాది వెంకట్రావు చెప్పారు. మండలంలోని వాకపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకపల్లి సర్పంచ్ రొంగల నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు తటవర్తి సుబ్బారావు, కురందాసు అప్పలరాజు, మురదా రమణ, చలపతిరావు, కురందాస్ మహాలక్ష్మి, కిల్లాడి బాబురావు పాల్గొన్నారు.

బీజేపీ నూతన అధ్యక్షుడిని కలిసిన ప్రత్తిపాడు నాయకులు

ప్రత్తిపాడు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు మాధవ్‌ను శనివారం ప్రత్తిపాడు నియోజకవర్గ బీజేపీ నాయకులు కలిశారు. జిల్లా పూర్వ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఉమ్మడి వెంకట్రావు, పైలా సుభాష్ చంద్రబోస్, మండలాధ్యక్షుడు వూట వీరబాబు శనివారం విశాఖ వెళ్లి మాధవ్‌ను అభినందించారు. నియోజకవర్గ బీజేపీ నాయకులు పైల అయ్యన్న, నీలి సురేష్, లౌడ్ శ్రీను, ఊటా శ్రీనివాస్, పలివాడ వెంకటేశ్వరరావు, చిత్రపాపారావు, బాలేపల్లి చక్రి, సోమ సత్తిబాబు పాల్గొన్నారు.



బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు మాధవ్‌ను సన్మానిస్తున్న ప్రత్తిపాడు బీజేపీ నాయకులు

ఘనంగా గోపూజ, శాంతి హోమాలు

ప్రత్తిపాడు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాచపల్లిలోని అరుణాచలేశ్వర ఆలయంలో శనివారం గోపూజ, శాంతిహోమాలు నిర్వహించారు. అరుణాచల ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు గోపూజ చేశారు. ఆలయ వ్యవస్థాపకులు రామానంద, నాయినార్ల చరిత్రకారణి, ప్రవచనకర్త అరుణాచల మాధవిలు ఈ పూజల్లో పాల్గొన్నారు. తీర్థ సంగ్రహణం, అగ్ని సంగ్రహణం, దిశ హోమం, మూర్తి హోమాలు నిర్వహించారు. ఈ నెల 7న ప్రతిష్ఠించే 63 నాయినార్ల విగ్రహాల ప్రతిష్ఠకు సంబంధించి పసుపు దంచే కార్యక్రమం మహిళా భక్తులు నిర్వహించారు.

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ

అన్నవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చి వాహనంపై ఆశీనులు గావించి పూజల అనంతరం తూర్పురాజ గోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి తిరిగి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.

'హోటల్‌లో వేంకటేశ్వరస్వామి నమూనా తొలగించండి'



హోటల్‌లో ఉన్న నమూనాను పరిశీలిస్తున్న శ్రీనివాసనంద సరస్వతి స్వామీజీ

గండేపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలో మల్లేపల్లి రాయుడు గారి మిలట్రీ హోటల్‌లో వేంకటేశ్వర స్వామి ఆలయ నమూనా పెట్టారని రాష్ట్ర వ్యాప్తంగా హల్‌చల్ అవుతున్న సంగతి తెలిసిందే. దీనిపై శనివారం ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతి స్వామీజీ, పలువురు స్వామీజీ పరిశీలించారు. హోటల్ యాజమాన్యానికి పలు సూచనలు చేశారు. వేంకటేశ్వరస్వామి ఆలయ నమూనాను ఏర్పాటు చేయడం సరికాదని వెంటనే దాన్ని తొలగించి చిత్రపటం పెట్టుకోవాలన్నారు.

ఆనూరులో వంగవీటి రంగా విగ్రహావిష్కరణ





మాట్లాడుతున్న వంగవీటి రాధా

తొండంగి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): దివంగత వంగవీటి రంగా విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా పైడికొండ శివారు ఆనూరు గ్రామంలో శనివారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధా మాట్లాడుతూ వంగవీటి ఆశయ సాధనకు యువత ముందుకు సాగాలన్నారు. గ్రామ యువత ఆధ్వర్యంలో రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఇతర కాపు సామాజికవర్గ నేతలు పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన

జగ్గంపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట వ్యవసాయాధికారి, సహాయ వ్యవసాయ సంచాలకులు, సిబ్బంది జగ్గంపేట మర్రిమొక్క వీధిలో రైతులను కలిసి సీసీఆర్‌సీ కౌలు కార్డులపై అవగాహన కల్పించారు. అనంతరం కార్డు లేని కౌలు రైతుల పేర్లు నమోదు చేశారు. రౌతులకు కౌలు కార్డులు పొందితే బ్యాంకు రుణాలు రావడానికి అవకాశం ఉంటుందన్నారు.

వైద్యాధికారులను నియమించండి

టీడీపీ గ్రామ అధ్యక్షుడు వినతి

జగ్గంపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): కాట్రావులపల్లి గ్రామం పీహెచ్‌సీలో డాక్టర్ పోస్టు ఖాళీగా ఉండడంతో ప్రజలు వైద్యం కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టీడీపీ గ్రామ అధ్యక్షుడు ముసిరెడ్డి నాగేశ్వరరావు డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. డీఎంహెచ్‌వో స్పందించి కాట్రావుపల్లి ఆసుపత్రికి ఒక లేడీ, జంట్ మెడికల్ ఆఫీసర్లను నియమించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు

తుని రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని మండల వ్యవసాయ శాఖాధికారి బి.అశోక్‌కుమార్ తెలిపారు. కొలిమేరు గ్రామంలో కొమ్ము దివానం రైతు పొలంలో వరి విత్తనాలు పంపిణీ చేసి నారుమడి వేయించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శివకుమార్, శివాజీ తదితరులున్నారు.

కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కావుడా), కాకినాడ

ఫారం నెం-1

(కావుడా పరిధిలో ముసాయిదా మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరములు మరియు సలహాలు సూచనలు కొరకు జారీ కాబడిన నోటిఫికేషన్)

ఆర్.ఒ.సి. నెం.73/2017/గుడా తేది:05-07-2025

(ఆంధ్రప్రదేశ్ మెట్రోపాలిటన్ రీజియన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టము, 2016 నందలి సెక్షన్12(1) మరియు ఆంధ్రప్రదేశ్ మెట్రోపాలిటన్ రీజియన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ రూల్సు, 2018 నందలి రూలు 16(3)న ను‌సరించి ఈ నోటీసు జారీ చేయడమైనది).

1.ఇందుమూలముగా తెలియచేయునది ఏమనగా ఈ క్రింది షెడ్యూలులో తెల్పిన ప్రాంతములతో కూడియున్న ఏలేశ్వరం నగర పంచాయితీ ప్రాంతమునకు మరియు శివారు ప్రాంతములతో కలిపి43.12 చ.కి.మీలు విస్తీర్ణము గల ప్లానింగ్ పరిధినకు ఎ.పి.టి.పి చట్టం-1920 నందలి సెక్షన్ 25(1) ప్రకారము ముసాయిదా మాస్టర్ ప్లాన్‌ను తయారు చేయబడినది. సదరు పరిధి జి.ఒ.ఎం.ఎస్.నెం.181 ఎం.ఎ & యు.డి తేది.17.01.2022 ప్రకారముగా కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, కాకినాడ పరిధిలోనికి విలీనం అయినందున ఆంధ్రప్రదేశ్ మెట్రోపాలిటన్ రీజియన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టము, 2016 నందలి సెక్షన్12 (1) మరియు ఆంధ్రప్రదేశ్ మెట్రోపాలిటన్ రీజియన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ రూల్సు, 2018 నందలి రూలు 16(3)ననుసరించి ప్రచురించమైనది.

2. సదరు ప్రతిపాదనలను తెలియచేయుచూ తయారు చేయబడిన సదరు ముసాయిదా మాస్టర్ ప్లాన్‌ను 'కావుడా' కార్యాలయము/ఏలేశ్వరం నగర పంచాయితీ మరియు శివారు రెవెన్యూ గ్రామాలు అన్ని కార్యాలయముల నందు అఫీసు పని వేళలో 30 రోజులు అనగా 06-07-2025వ వరకు ఉచితముగా తనిఖీ చేసుకొనుటకు ఉంచబడును మరియు www.kauda.ap.gov.in వెబ్‌సైట్ నందు పరిశీలన కొరకు పొందుపర్చడమైనది.

3. సదరు ముసాయిదా మాస్టర్ ప్లాను నందలి ఏదైనా ప్రతిపాదనపై అభ్యంతరములు (లేదా) సూచనలు చేయు వ్యక్తులెవరైనను వ్రాత పూర్వకముగా వారి యొక్క భూయాజమాన్య ధృవీకరణ పత్రములతో కార్యాలయమునకు (లేదా) ఈ-మెయిల్ vckauda@gmail.com ద్వారా వైస్-చైర్మన్, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, కాకినాడ వారికి (లేదా) ఈ-మెయిల్ commissioneryeleswaram@gmail.com ద్వారా కమీషనర్, ఏలేశ్వరం నగర పంచాయితీ వారికి అఫీసు పని వేళలలో 30రోజులు అనగా 06-07-2025 నుండి ది.04-08-2025వ తేదిలోగా అందచేయవలెను.

'కావుడా' పరిధిలోనికి వచ్చు నగర పంచాయితీ మరియు సమీప రెవెన్యూ గ్రామముల షెడ్యూలు:

సం.నెం	నగర పంచాయితీ పేరు గ్రామం పేరు
1	ఏలేశ్వరం నగర పంచాయితీ
2	లింగంపర్తి
3	తిరుమాలి
4	సి.రాయవరం
5	రమణయ్యపేట

తేది: 05-07-2025 స్థలము కాకినాడ

వైస్-చైర్మన్ కావుడా, కాకినాడ